
సాక్షి గుంటూరు

గురువారం । 12 । అక్టోబర్ । 2023




సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 526.30 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 5,496 క్యూసెక్కులు విడుదలవుతోంది.



భూముల రీసర్వే పరిశీలన

నరసరావుపేట రూరల్: లింగంగుంట్ల అగ్రహారం భూముల రీసర్వేను బుధవారం జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ పరిశీలించారు. అధికారులకు సూచనలు చేశారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 3007 క్యూసెక్కులు విడుదల చేశారు.

న్యూస్‌రీల్

క్యాన్సర్ విభాగానికి పోస్టులు మంజూరు

గుంటూరు మెడికల్ : గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో క్యాన్సర్ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది పోస్టులు మంజూరు చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ, మెడికల్ ఆఫీసర్స్, సీనియర్ రెసిడెంట్, స్టాఫ్‌నర్సు, రేడియేషన్ సేఫ్టీ ఆఫీసర్, జనరల్ డ్యూటీ అటెండెంట్, రేడియోథెరఫీ టెక్నీషియన్, సిటీ టెక్నీషియన్, మెడికల్ రికార్డ్ ఆఫీసర్, మెడికో సోషల్ వర్కర్, జూనియర్ అసిస్టెంట్, ఫార్మసిస్టు ఎనస్థీషియా టెక్నీషియన్, హెడ్‌నర్సు, ల్యాబ్ టెక్నీషియన్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, ఇలా 42 కేడర్లకు చెందిన 353 పోస్టులను విశాఖపట్నం, గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రులకు మంజూరు చేసింది.

యార్డుకు 31,729 బస్తాల మిర్చి



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 31,729 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 30,380 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి 26,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.13,300 నుంచి రూ.21,500 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.12,000 నుంచి 26,500 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 11,870 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

వాక్-ఇన్ ఇంటర్వ్యూలు

గుంటూరు మెడికల్: మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో విజయవాడ ఇబ్రహీంపట్నం ఆర్.కే.కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో ఈనెల 13న క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రామ్ మేనేజర్ చిలుకా మోహన్ తెలిపారు. అపోలో ఫార్మసీ కంపెనీ 200లకుపైగా పోస్టులను క్యాంపస్ డ్రైవ్ ద్వారా భర్తీ చేస్తుందని పేర్కొన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి రూ.12వేల నుంచి రూ.20వేల వరకు వేతనం చెల్లిస్తారని పేర్కొన్నారు. ఇంటర్, డిగ్రీ, ఫార్మసీ చదివిన వారు ఉద్యోగాలకు అర్హులని పేర్కొన్నారు. విజయవాడ, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో పనిచేయాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 96769 55667,78425 03456 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నేడు ఫార్మాసిస్టులకు సన్మానం

గుంటూరు మెడికల్: ఏపీ ఫార్మసీ కౌన్సిల్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా ఫార్మసీ రంగంలో విశేషంగా సేవలందిస్తున్న ఫార్మాసిస్టులు, ఫార్మసీ విద్యార్థులు, ఫార్మసీ కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు గురువారం సన్మానం చేసి ప్రశంసా పత్రాలు అందజేస్తున్నామని కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ ప్రసాద్ రెడ్డి చెప్పారు. బుధవారం స్థానిక అరండల్‌పేటలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కరోనా సమయంలో వైద్య రంగంలో ఫార్మాసిస్టులు కూడా విశేష సేవలందించారని పేర్కొన్నారు. వారి సేవలను గుర్తించి ఫార్మసీ కౌన్సిల్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 10 గంటలకు గుంటూరు వైద్య కళాశాల జింఖానా ఆడిటోరియంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఫార్మసీ విద్యార్థులు వంద మంది, ఫార్మసీ కళాశాలల ప్రిన్సిపాల్స్ వంద మంది, ఫార్మాసిస్టులు 40 మందిని సన్మానించి ప్రశంసా పత్రాలు అందజేస్తున్నామన్నారు. ఫార్మసీ కోర్సుల్లో కళాశాల స్థాయిలో మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థులను, అత్యుత్తమ ఫార్మసీ బోధన చేస్తున్న ప్రిన్సిపాల్స్‌ను సన్మానిస్తున్నామన్నారు. ఫార్మసీ కౌన్సిల్ చరిత్రలో ఇప్పటి వరకు ఇలాంటి కార్యక్రమాలు జరగలేదని వెల్లడించారు.

కబడ్డీ పోటీల వేదిక మార్పు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 13న సాతులూరులోని జెడ్పీహెచ్ఎస్ స్కూల్లో జరగాల్సిన అండర్-17 బాలబాలికల కబడ్డీ పోటీల వేదికను మార్పు చేసినట్లు నిర్వహణ కార్యదర్శి జి.ప్రతాప్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలను అదే రోజు కొామెరేపూడి జెడ్పీహెచ్ఎస్ స్కూల్లో నిర్వహిస్తామని పేర్కొన్నారు. మార్పును గుర్తించాలని కోరారు.

జీవన సౌందర్యం

- గ్రీన్ గుంటూరు
- పచ్చదనం పెంపుపై దృష్టి
- పార్కుల అభివృద్ధి వేగవంతం
- రూ.9 కోట్లతో పార్కులు, రూ.6.24 కోట్లతో సెంట్రల్ డివైడర్ల అభివృద్ధి
- రూ.2.56 కోట్లతో ఐలాండ్ల సుందరీకరణ



'ఆనంద'నవనం : నగరంలోని ఓ పార్కు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: నగరంలో పచ్చదనం పెంచే దిశగా అడుగులు పడుతున్నాయి. పాలకవర్గం ఉద్యానవనాలపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తోంది. ఫలితంగా ప్రగతి పవనాలు వీస్తున్నాయి. అద్భుత జీవన సౌందర్యం ఆవిష్కృతమవుతోంది.

ప్రాధాన్యక్రమంలో పార్కుల అభివృద్ధి

గుంటూరు నగరంలో ప్రసిద్ధి చెందిన గాంధీ పార్కుతోపాటు పలు కాలనీల్లో పార్కులు ఉన్నా అవి గతంలో అభివృద్ధికి నోచుకోలేదు. ప్రస్తుతం పాలక వర్గంతోపాటు కమిషనర్ చేకూరి కీర్తి బాధ్యతలు తీసుకున్న తర్వాత వీటిపై దృష్టి సారించారు. సుమారు నాలుగున్నర కోట్ల రూపాయల ఖర్చుతో గాంధీపార్కును సుందరంగా తీర్చిదిద్దారు. ఈ పార్కు పునరుద్ధరణ పనులు పూర్తయ్యి ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. అలాగే వార్డుల వారీగా ఆర్టీసీ కాలనీలో రెండు పార్కులు, షాపు ఎంప్లాయీస్ కాలనీ, లాల్‌జాన్ బాషా కాలనీ, శ్యామల నగర్, ఉద్యోగ నగర్, ఎస్‌వీఎన్ కాలనీ, కొరిటెపాడు పార్కులను ప్రాధాన్యక్రమంలో అభివృద్ధి చేశారు. వాటిలో వాకింగ్ ట్రాక్‌లు, పిల్లల ఆట పరికరాలు, ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు. పచ్చదనం పెంపునకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. నగరంలో 22 పార్కులను సుమారు రూ.తొమ్మిది కోట్లతో అభివృద్ధి చేయడంతో అవి కొత్త శోభను సంతరించుకున్నాయి.

ఖాళీస్థలాల్లో ప్లే సెంటర్స్

నగరపాలక సంస్థకు చెందిన ఖాళీ స్థలాలు, రిజర్వ్ సైట్లనూ గుర్తించి వాటిని ప్లే సెంటర్స్, వాకింగ్ ట్రాక్‌లుగా అభివృద్ధి చేసేందుకు నగరపాలక సంస్థ అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. కొరిటెపాడు, సమ్మర్‌పేట, చుట్టుగుంట చెరువులనూ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. నగరంలోని 15 ఐలాండ్స్‌ని రూ.2.56 కోట్లతో అభివృద్ధి చేస్తున్నారు. ఇప్పటికే ఎనిమిది సెంటర్లలో అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు వేగంగా జరుగుతున్నాయి. నగరపాలక సంస్థ పరిధిలో 42 కిలోమీటర్ల మేర ఉన్న సెంట్రల్ డివైడర్లను రూ.6.24 కోట్ల అంచనాలతో మొక్కలతో అందంగా తీర్చిదిద్దుతున్నారు.



కను'బొమ్మలు' మెరిసే : గాంధీ పార్కులో ఏర్పాటు చేసిన బొమ్మలు

> **పచ్చదనానికి ప్రాధాన్యం**
>
> నగరంలోని పార్కుల్లో, నగరపాలక సంస్థ ఖాళీ స్థలాల్లో మొక్కల పెంపకానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. నగరంలో చేపట్టిన పచ్చదనం, సుందరీకరణ పనులు పూర్తవుతున్నాయి. పార్కులన్నీ పచ్చదనంతో ఆహ్లాదంగా ఉండేలా తీర్చిదిద్దుతున్నాం. దీంతోపాటు వాకింగ్ ట్రాక్‌లు, పిల్లలు ఆడుకునే వస్తువులను ఏర్పాటు చేస్తున్నాం.
>
> – కీర్తి చేకూరి, మున్సిపల్ కమిషనర్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న హరిత నగరాల్లో భాగంగా సెంట్రల్ మీడియన్స్, రోడ్ పక్కన మార్జిన్లలో పచ్చదనం పెంపునకు చర్యలు చేపడుతున్నారు. నగరంలోని ఐలాండ్స్‌లో గడ్డి లాన్, వివిధ రకాలైన పూల (పొట్టి జాతి షర్ప్) మొక్కలను నాటారు. నగరంలోని ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ప్రధాన ఎంట్రీ పాయింట్లలో, సెంట్రల్ మీడియన్స్, వంతెనలు, ప్రభుత్వ కార్యాలయాల ప్రహరీలను ఆకట్టుకునే బొమ్మలతో సుందరంగా మార్చారు.

- 175 సీట్లలో గెలుపే లక్ష్యం
- లేళ్ల అప్పిరెడ్డికి సముచిత గౌరవం
- బాబు అవినీతికి పాల్పడ్డారని ప్రజలకు తెలుసు
- టీడీపీ మునిగిపోతున్న పడవ
- మంత్రి అంబటి రాంబాబు



శాసన మండలి విప్‌గా నియమితులైన లేళ్ల అప్పిరెడ్డికి పుష్పగుచ్ఛం అందించి అభినందిస్తున్న మంత్రి అంబటి, డొక్కా మాణిక్యవరప్రసాద్

సీఎం జగన్ సుపరిపాలన

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. పార్టీలో వేచి ఉంటే ఎవరికైనా పదవులు వస్తాయని అని నిరూపించిన వ్యక్తి ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి అని పేర్కొన్నారు. గుంటూరు విద్యానగర్‌లోని క్యాంప్ కార్యాలయంలో మంత్రి అంబటి రాంబాబును బుధవారం శాసన మండలి విప్‌గా నియమితులైన లేళ్ళ అప్పిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ అప్పిరెడ్డిని అభినందించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మంత్రి అంబటి మాట్లాడుతూ లేళ్ళ అప్పిరెడ్డి విద్యార్థి దశ నుంచి రాజకీయాల్లో ఉన్నారని, అనేక ఆటుపోట్లు ఎదుర్కొన్నారని చెప్పారు. కార్యకర్తలకు లేళ్ళ అప్పిరెడ్డి ఒక ఉదాహరణ అని పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్ ఐదేళ్ల పాలనలో సుపరిపాలనను అందించారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో 175 సీట్లు గెలుపొందడమే లక్ష్యమని స్పష్టం చేశారు. ఈనెల 26 నుంచి బస్ యాత్ర ప్రారంభమవుతుందని చెప్పారు. 1 నుంచి జగనన్న ఎందుకు కావాలి అనే కార్యక్రమాలు జరగనున్నాయని తెలిపారు.

టీడీపీ హయాంలో రూ.వేల కోట్లు స్వాహా

టీడీపీ గత ఐదేళ్ల పాలనలో చంద్రబాబు, లోకేష్ దోపిడీకి తెగబడ్డారని మంత్రి రాంబాబు విమర్శించారు. వేల కోట్ల రూపాయల ప్రజా సొమ్మును స్వాహా చేశారని, దాని వల్లే కేసులు నడుస్తున్నాయని స్పష్టం చేశారు. బాబు అరెస్ట్‌లో రాజకీయ కక్ష సాధింపు లేదని పేర్కొన్నారు. సీఐడీ విచారణ నుంచి బయటకు వచ్చి నిజాయితీపై లోకేష్ మాట్లాడటం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. టీడీపీ సర్వనాశనానికి కారణం అతడేనని విమర్శించారు.

పరామర్శించకుండా ఢిల్లీ..

చంద్రబాబు అరెస్ట్ మాట విని గుండె ఆగి వందలాది మంది చనిపోయారని ఎల్లో మీడియా వార్తలు రాసిందని, అనారోగ్యంతో చనిపోయినా బాబు ఖాతాలో వేశారని మంత్రి రాంబాబు ఎద్దేవా చేశారు. అంతమంది చనిపోతే లోకేష్ ఆ కుటుంబాలను పరామర్శించకుండా ఎందుకు ఢిల్లీ వెళ్లారని మంత్రి ప్రశ్నించారు. టీడీపీ మునిగిపోతున్న పడవ అని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో కుప్పంలోనూ బాబు ఓడిపోతారని జోస్యం చెప్పారు. బాబు అరెస్ట్‌పై ప్రజల్లో సానుభూతి లేదని, అవినీతికి పాల్పడటం వల్లే బాబు జైలుకు వెళ్లారనేది ప్రజలకు తెలుసని, సానుభూతి ఎలా వస్తుందని ప్రశ్నించారు.

17 నియోజకవర్గాల్లో గెలుపుపై..

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ ఈనెల 26న బస్ యాత్ర ప్రారంభమవుతుందని చెప్పారు. నిత్యం కార్యకర్తలతో ఉండే వ్యక్తి లేళ్ళ అప్పిరెడ్డి అని కొనియాడారు. సీఎం జగన్ లేళ్ళ అప్పిరెడ్డికి సముచిత గౌరవం ఇచ్చారని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో 17 నియోజకవర్గాల్లో గెలుపుపై ముఖ్య నేతలతో చర్చించామన్నారు. సమావేశంలో మార్కెట్ యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజానారాయణ, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి రామాంజనేయులు, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బత్తుల దేవానంద్, నాయకులు తాడిశెట్టి మురళి, చిన్నప్పరెడ్డి, అనీల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

కేఎల్‌యూలో జ్యోతి సురేఖకు సన్మానం



బంగారు పతకాలు సాధించిన జ్యోతి సురేఖను అభినందిస్తున్న కేఎల్‌యూ ప్రతినిధులు

తాడేపల్లిరూరల్: చైనాలో ఇటీవల ముగిసిన ఆసియా క్రీడలు 2023లో విలువిద్యలో మూడు బంగారు పతకాలు సాధించిన పూర్వ విద్యార్థి జ్యోతిసురేఖను కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా వర్సిటీ విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు మాట్లాడుతూ జ్యోతి సురేఖ ఇటీవల జరిగిన ఆసియా క్రీడల్లో విలువిద్యలో మూడు బంగారు పతకాలు గెలుచుకోవడం తమ యూనివర్సిటీకి గర్వకారణమని చెప్పారు. ఈ సందర్భంగా ఆర్చరీ క్రీడాకారిణి వెన్నం జ్యోతి సురేఖను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, క్రీడల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.హరికిషోర్, వ్యాయామ అధ్యాపకులు, విద్యార్థులు అభినందిచారు.

దుర్గగుడి ఈవో రామారావు బాధ్యతల స్వీకరణ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన ఈవోగా కేఎస్ రామారావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఉదయం ఆలయానికి చేరుకున్న ఆయన తొలుత దుర్గా మల్లేశ్వర స్వామి వార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పూర్వ ఈవో భ్రమరాంబ ఆలయానికి చేరుకోగా, అమెకు ఈవో రామారావు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. ఆశీర్వచన మండపంలో భ్రమరాంబ నుంచి రామారావు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఈవో చాంబర్‌లో రామారావుకు ఆలయంలోని కీలక విభాగాల అధికారులు, సిబ్బందిని భ్రమరాంబ పరిచయం చేశారు. దసరా ఉత్సవాల నేపథ్యంలో ఇంజినీరింగ్ సిబ్బంది, ఏఈవోలతో ఈవో సమావేశమయ్యారు. ప్రసాదాల తయారీకి అవసరమయ్యే సరుకుల కొనుగోలుతో పాటు కొన్ని కీలక అంశాలపై చర్చించారు. అనంతరం ఆలయంలోని వివిధ విభాగాలను పరిశీలించారు. చైర్మన్ కర్నాటి రాంబాబును ఆయన చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలుసుకోవడమే కాకుండా తులసి వనంలో చైర్మన్, పాలక మండలి సభ్యులతో కలిసి మొక్కను నాటారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు బుద్దా రాంబాబు, కట్టా సత్తెయ్య, బచ్చు మాధవీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. మహామండపం రెండో అంతస్తులోని అన్నదాన పంపిణీ ప్రదేశానికి చేరుకుని భక్తులతో మాట్లాడారు.

నేటి నుంచి వినూ మన్కడ్ ట్రోఫీ మ్యాచ్‌లు

- మంగళగిరి, మూలపాడులలో ఏర్పాట్లు పూర్తి చేసిన ఏసీఏ
- ముమ్మరంగా ప్రాక్టీస్ చేసిన జట్లు
- ప్రేక్షకులకు ఎంట్రీ ఉచితం

మంగళగిరి: గుంటూరు జిల్లా అమరావతి టౌన్‌షిప్‌లోని ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంతో పాటు కృష్ణా జిల్లా మూలపాడులోని అంతర్జాతీయ క్రికెట్ స్టేడియాలలో గురువారం నుంచి అండర్ -19 పురుషుల వినూ మన్కడ్ ట్రోఫీ క్రికెట్ పోటీల నిర్వహణకు సర్వం సిద్ధమైంది. పోటీల్ని విజయవంతంగా నిర్వహించేందుకు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాట్లను పూర్తి చేశారు. ఏసీఏ జాయింట్ సెక్రటరీ ఎ. రాకేష్, సెంట్రల్ జోన్ అకాడమి చైర్మన్ కె.వి.పురుషోత్తం మైదానాల్ని ఎప్పటికప్పుడూ పరిశీలిస్తూ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ గ్రూపులో ఢిల్లీ, మహారాష్ట్ర, బెంగాల్, మేఘాలయ, హైదరాబాద్, ఉత్తరాఖండ్ జట్లు ఆడతాయి.

- గురువారం మంగళగిరి స్టేడియంలో హైదరాబాద్, ఉత్తరాఖండ్‌లు తలపడనుండగా మూలపాటు సీపీ స్టేడియంలో బెంగాల్, మేఘాలయ, డీవీఆర్ స్టేడియంలో బెంగాల్, మేఘాలయ తలపడనున్నాయి.
- 14న మంగళగిరి స్టేడియంలో బెంగాల్, ఢిల్లీ తలపడనుండగా మూలపాడు డీవీఆర్ గ్రౌండ్‌లో హైదరాబాద్, మహారాష్ట్ర , సీపీఆర్ గ్రౌండ్‌లో మేఘాలయ, ఉత్తరాఖండ్ జట్లు ఢీకొంటాయి.
- 16న మంగళగిరి స్టేడియంలో ఢిల్లీ, ఉత్తరాఖండ్, మూలపాడు సీపీ గ్రౌండ్‌లో బెంగాల్, మహారాష్ట్ర, డీవిఆర్ గ్రౌండ్‌లో హైదరాబాద్ , మేఘాలయ పోటీ పడతాయి.
- 18న మంగళగిరి ఏసీఏ స్టేడియంలో బెంగాల్ , హైదరాబాద్, మూలపాడు డీవీఆర్ గ్రౌండ్‌లో ఢిల్లీ, మేఘాలయ, సీపీ గ్రౌండ్‌లో మహారాష్ట్ర, ఉత్తరాఖండ్ జట్లు తలపడనున్నాయి.
- 20న మంగళగిరి ఏసీఏ స్టేడియంలో మహారాష్ట్ర, మేఘాలయ, మూలపాడు సీపీ గ్రౌండ్‌లో ఢిల్లీ, హైదరాబాద్, డీవీఆర్ గ్రౌండ్‌లో బెంగాల్, ఉత్తరాఖండ్ జట్లు పోటీ పడతాయి.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో బుధవారం క్వింటా నిమ్మకాయల కనిష్ట ధర రూ.3,500, గరిష్ట ధర రూ.4,600, మోడల్ ధర రూ.4,000 వరకు పలికింది.

దసరాకు 62 ప్రత్యేక ఆర్టీసీ బస్సులు

నరసరావుపేట: దసరా పండగ రద్దీని దృష్టిలో పెట్టుకొని ఆర్టీసీ ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులను నడపనుంది. ఈనెల 18 నుంచి 23వ తేదీ వరకు జిల్లా కేంద్రమైన నరసరావుపేటతో పాటు జిల్లాలోని వివిధ డిపోల నుంచి 62 ప్రత్యేక బస్సు సర్వీసులను నడపనుంది. ముఖ్యంగా ఇవి హైదరాబాద్ నుంచి ఆయా డిపోల మధ్యనే తిరుగుతాయి. ప్రస్తుతం ఉన్న సాధారణ చార్జీలనే వర్తింపజేయనున్నారు. రాను, పోను టిక్కెట్లను ఆన్‌లైన్ లేదా రిజర్వేషన్ కౌంటర్ల ద్వారా ముందుగానే బుక్‌చేసుకునే అవకాశం కల్పించారు. ముందే బుక్ చేసుకునే వారికి సాధారణ చార్జీలో పదిశాతం రాయితీ కూడా కల్పిస్తున్నారు. ఈనెల 18న చిలకలూరిపేట, వినుకొండ డిపోలకు ఒక్కొక్క బస్సు హైదరాబాద్ నుంచి నడపనున్నారు. 19న నరసరావుపేట, చిలకలూరిపేట, వినుకొండ డిపోలకు రెండు చొప్పున ఆరు ప్రత్యేక బస్సులు రానున్నాయి. 20న మొత్తం 18 బస్సులు హైదరాబాద్ నుంచి ఏర్పాటుచేయగా వాటిలో ఐదు నరసరావుపేట, చిలకలూరిపేటకు మూడు, వినుకొండ, మాచర్లకు నాలుగు బస్సుల చొప్పున, పిడుగురాళ్లకు రెండు బస్సులు ప్రయాణించనున్నాయి.

పవిత్రోత్సవాలు ప్రారంభం



దేవతామూర్తులకు పవిత్రములు సమర్పిస్తున్న ఏసీ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు తదితరులు

పెదకాకాని: శివాలయంలో పవిత్రోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇవి బుధవారం నుంచి మూడు రోజులపాటు జరుగుతాయని ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు తెలిపారు. తొలిరోజు దేవతామూర్తులకు పవిత్రములు సమర్పణ క్రతువు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం 7 గంటలకు చతుర్వేదపారాయణం, 8 గంటలకు పవిత్రాల వెదురు పేటికలతో ఆలయ యజ్ఞశాల ప్రదక్షిణ, పూర్వాకముగ యాగశాల ప్రవేశం, శివానుజ్ఞ శ్రీ విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, పంచగవ్యపూజ, ప్రాశన, రక్షాసూత్రపూజ, ధారణ, రుత్విగ్వరణ, దీక్షాధారణ, అఖండ దీపస్థాపన, యాగేశ్వర కుంభస్థాపన, పూజ, వాస్తు కుంభస్థాపన, పూజ, వాస్తు శాంతిహోమం, బలి, పర్యాగ్నికరణ, బలిహరణ నిర్వహించారు. పవిత్రాలతో పెదకాకాని వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం 5:30 గంటలకు మృత్సంగ్రహణము, అంకురారోపణ, అష్ట లింగతో భద్ర పీఠముపై పరివార దేవతా సహిత శివకుంభవర్ధినీ కలశస్థాపన, పూజ దిక్పాలపూజ, శాంతి కుంభస్థాపన, పూజ అగ్నిప్రతిష్ఠాపన, ఆవరణ హోమాలు, పరివార దేవతాహోమాలు, గంథం పవిత్రాధివాసము, పూజ, హారతి, చతుర్వేద స్వస్తి, బలిహరణ ప్రసాద వినియోగం నిర్వహించారు. పూజా కార్యక్రమాల ఏర్పాట్లను ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, పాలకవర్గం చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు, సభ్యులు పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజా కార్యక్రమాలను తిలకించారు. అన్నప్రసాద వితరణ జరిగింది.

ఇన్‌స్పైర్ మనక్‌లో సత్తా చాటిన గుంటూరు జిల్లా విద్యార్థి

- దేశ వ్యాప్తంగా పోటీపడిన 600 మంది విద్యార్థులు
- రాష్ట్రపతిభవన్‌కు ఎంపికైన 60 మంది విద్యార్థులు
- ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంపికైన నలుగురిలో ఒకరిగా గోవర్ధన నాయుడు



ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో బుధవారం కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న గోవర్ధన నాయుడు



తాను రూపొందించిన బై సైకిల్ అంబులెన్స్ ప్రాజెక్టుతో గోవర్ధన నాయుడు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యారంగంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన విప్లవాత్మక సంస్కరణలతో ప్రపంచ దేశాల ముందు ప్రతిభ చాటుతున్న ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు జాతీయస్థాయి ఇన్‌స్పైర్ మనక్‌లోనూ సత్తా చాటారు. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ఈనెల 9,10,11 తేదీల్లో కేంద్ర శాస్త్ర, సాంకేతిక విభాగ ఆధ్వర్యంలో నిర్వహించిన 10వ జాతీయస్థాయి ఇన్‌స్పైర్ మనక్ విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి నలుగురు విద్యార్థులు రాష్ట్రపతి భవన్‌కు ఎంపికయ్యారు. వారిలో ఒకరిగా గుంటూరు జిల్లాలోని కొల్లిపర మండలం అత్తోట జెడ్పీ హైస్కూలు 10వ తరగతి విద్యార్థి అద్దంకి గోవర్ధన నాయుడు అర్హత సాధించారు. గతేడాది టెన్త్ విద్యార్థిగా ఉన్న అతడు ప్రస్తుతం నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఇంటర్మీడియెట్ చదువుతున్నాడు. గత మార్చిలో కాకినాడలో ఆన్‌లైన్ వేదికగా జరిగిన రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ మనక్‌లో ప్రతిభ చూపి, జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. మూడు రోజుల పాటు న్యూఢిల్లీలో జరిగిన జాతీయస్థాయి ఇన్‌స్పైర్ మనక్ ప్రదర్శనలో తాను రూపొందించిన ప్రాజెక్టును ప్రదర్శించాడు. రవాణా సదుపాయం లేని మారుమూల గిరిజన, కొండ ప్రాంతాల నుంచి రోగుల్ని తరలించేందుకు వీలుగా తయారు చేసిన ''బై సైకిల్ అంబులెన్స్' ప్రాజెక్టు జాతీయస్థాయిలో అర్హత సాధించింది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి హాజరైన 600 మంది విద్యార్థులతో పోటీ పడి, రాష్ట్రపతి భవన్‌కు ఎంపికైన 60 మంది విద్యార్థుల్లో నలుగురు ఏపీకి చెందిన విద్యార్థులు ఉండగా, వారిలో ఒకరిగా గుంటూరు జిల్లా నుంచి గోవర్ధన నాయుడు ఉన్నారు. ప్రాజెక్టు రూపకల్పనలో గురజాల మండలం జంగమహేశ్వరపురం జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం రాయపాటి శివనాగేశ్వరరావు గైడ్ టీచర్‌గా వ్యవహరించారు.

రూ.10వేలతో బైసైకిల్ అంబులెన్స్

అంబులెన్స్ వెళ్లలేని అటవీ, కొండ ప్రాంతాల నుంచి గర్భిణులు, ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులను ఆస్పత్రికి త్వరగా చేర్చేందుకు రూపొందించిన బై సైకిల్ అంబులెన్స్‌లో ప్రత్యేకంగా రూపొందించిన స్ట్రెచర్‌కు రెండు చక్రాల్ని తగిలించారు. దీనిని సైకిల్‌కు అమర్చి రోగులను ఆస్పత్రికి తీసుకుని వెళ్లవచ్చు. ఇందులో ప్రథమ చికిత్స అందించే కిట్‌తో పాటు ఆక్సిజన్ సిలిండర్, సోలార్ విద్యుత్‌తో పని చేసే ఫ్యాన్, లైట్లు, సైరన్ ఉంటాయి. ఇరుకు రోడ్లలోనూ రోగిని ఇబ్బంది లేకుండా వైద్యశాలకు తరలించవచ్చు. రూ.10వేల ఖర్చుతో రూపొందించగలిగే బైసైకిల్ అంబులెన్స్ ప్రాజెక్టుకు ప్రభుత్వం ప్రోత్సాహాన్ని అందిస్తే, ఈ వాహనాలను తయారు చేసి గ్రామీణ, గిరిజన ప్రాంతాలకు అందించవచ్చునని విద్యార్థి గోవర్ధన నాయుడు, గైడ్ టీచర్ రాయపాటి శివనాగేశ్వరరావు చెబుతున్నారు.

కేంద్ర మంత్రి చేతుల మీదుగా ప్రశంసాపత్రం

న్యూఢిల్లీలో బుధవారం జరిగిన ముగింపు కార్యక్రమంలో కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాస్త్ర మంత్రి డాక్టర్ జితేంద్రసింగ్ చేతుల మీదుగా గోవర్ధన నాయుడు ప్రశంసాపత్రం అందుకున్నాడు. రాష్ట్రపతి భవన్‌కు ఎంపికైన విద్యార్థులందరినీ త్వరలో జపాన్‌లోని సకురాల సైన్స్ ఎక్స్చేంజ్ ప్రోగ్రాంకు కేంద్ర ప్రభుత్వం పంపనుంది. ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో డీఎస్టీ డైరెక్టర్ కులందకర్, ఎన్ఐఎఫ్ డైరెక్టర్ పీఎస్ గోయల్, ఏపీ ఎస్సీఈఆర్టీ నోడల్ అధికారి డాక్టర్ భాగ్యశ్రీ, ఉపాధ్యాయులు పి. మేరీ, శారద పాల్గొన్నారు. జాతీయస్థాయిలో ప్రతిభ చాటిన విద్యార్థి గోవర్ధన నాయుడుతో పాటు గైడ్ టీచర్ ఆర్.శివనాగేశ్వరరావు, జిల్లా సైన్స్ అధికారి ఏఏ మధుకుమార్‌ను పాఠశాల విద్య ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు, డీఈవోలు పి.శైలజ, కె.శ్యామ్యూల్ అభినందించారు.

క్లుప్తంగా

కలెక్టర్‌ను కలసిన ఏసీఏ ప్రతినిధులు


కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డికి వినతిపత్రం అంద జేస్తున్న గోపీనాథ్ రెడ్డి, రమేష్ కుమార్

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్ఆర్ గోపీనాథ్ రెడ్డి, జిల్లా కార్యదర్శి దాసరి రమేష్ కుమార్‌లు బుధవారం కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం గోపీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ మంగళగిరి క్రికెట్ స్టేడియం వద్ద పోలీస్ పికెట్‌తోపాటు సమీపంలోని రైల్వే గేటు వద్ద ఫ్లైఓవర్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశామన్నారు. గురువారం నుంచి ఈ స్టేడియంలో అండర్–19 అంతర్ రాష్ట్రాల క్రికెట్ పోటీలు ప్రారంభమవుతాయని చెప్పారు. దీంతోపాటు రోడ్లు, విద్యుత్ లైట్లు కూడా వేయించాలని అడిగామన్నారు. దీనికి కలెక్టర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు.

ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలి

- అదే ప్రభుత్వ ధ్యేయం
- సంయుక్త కలెక్టర్ జి. రాజకుమారి

పొన్నూరు: ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేసి ఇంటింటికీ వైద్య సేవలు అందిస్తుందని జిల్లా సంయుక్త కలెక్టర్ జి. రాజకుమారి అన్నారు. మండలంలోని మామిళ్ళపల్లి గ్రామం ఎంపీయూపీ పాఠశాలలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ సందర్శించారు. ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించి, వైద్య పరీక్షలపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న ఇంటింటి ఆరోగ్య సర్వే ద్వారా ఏడు రకాల వైద్య పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. సాధారణ వ్యాధులకు అక్కడే మందులు అందిస్తున్నట్లు చెప్పారు. చికిత్స తీసుకోవాల్సిన రోగులకు వైద్య శిబిరాలలో మరిన్ని వైద్య పరీక్షలు నిర్వహించి వ్యాధి నయం అయ్యేంతవరకు సరిపడా మందులు అందిస్తున్నట్లు తెలిపారు. వ్యాధి తీవ్రత ఆధారంగా మెరుగైన చికిత్స కోసం ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ వైద్యశాలల్లో పూర్తిస్థాయిలో వైద్యాన్ని అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజలకు వరం లాంటిదని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకొని వైద్య సేవలు ఉచితంగా పొందాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బి. పద్మలీల, గ్రామ సర్పంచ్ యానాది రావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఆకుల వెంకటేశ్వర రావు, ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసీల్దారు కె. శ్రీకాంత్, డాక్టర్ మహమ్మద్ హుస్సేన్, సచివాలయ సిబ్బంది, ఆశ వర్కర్లు, అంగన్‌వాడి కార్యకర్తలు, వలంటీర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


వైద్య శిబిరంలో సిబ్బందితో మాట్లాడుతున్న సంయుక్త కలెక్టర్ రాజకుమారి

15న బాల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక

గుంటూరు వెస్ట్ (క్రీడలు): బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో జూనియర్ బాల బాలికల జట్ల ఎంపిక నిర్వహిస్తామని అసోసియేషన్ కార్యదర్శి ఇ.శివ శంకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలను ఈ నెల 15న స్థానిక ఎన్జీఓ క్లబ్‌లో ఏర్పాటు చేశామన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభకనబరచిన జట్టును ఎంపిక చేసి ఈ నెల 22 నుంచి 24 వరకు చిత్తూరు జిల్లా కనిగిరిలో జరగనున్న అంతర్ జిల్లాల పోటీలకు పంపిస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే వారు ఆధార్‌తో పాటు వయస్సు ధృవీకరణ పత్రం తీసుకురావాలన్నారు. వివరాలకు 93969 90666 సంప్రదించాలని తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో ఇంటి ముంగిటకే వైద్యం

- ముఖ్యమంత్రి చేపట్టిన చారిత్రాత్మక కార్యక్రమం
- కలెక్టర్ ఎం.వేణుగోపాల రెడ్డి
- కొత్తరెడ్డిపాలెంలో ఆరోగ్య శిబిరం

చేబ్రోలు: ప్రజల ఇంటి ముంగిటకే మెరుగైన వైద్యం అందించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష అనే చారిత్రాత్మకమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి అన్నారు. మండల పరిధిలోని కొత్తరెడ్డిపాలెంలోని కొండవీటి కమిటీ ప్రాథమిక పాఠశాలలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరంలో ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా చేపట్టిన పనులను గమనించి ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. వైద్య శిబిరం వద్ద ఏర్పాటు చేసిన రిజిస్ట్రేషన్ కౌంటర్, డాక్టర్ కన్సల్టేషన్ గదులు, ల్యాబ్ పరీక్షలు, మందులిచ్చే కౌంటర్లు, నేత్ర పరీక్షల విభాగాలలో అందిస్తున్న వైద్యులు, సిబ్బంది నుంచి వివరాలు తెలుసుకుని సూచనలు చేశారు.

బీపీ, నేత్ర పరీక్షల విధానాన్ని పరిశీలించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహారం స్టాల్‌ను పరిశీలించారు. మహిళలకు అవగాహన కల్పిస్తున్న విధానాన్ని తెలుసుకున్నారు. హౌస్ సర్వేలో నమోదు కాని వారిని సైతం వైద్య శిబిరంలో ప్రత్యేకంగా రిజిస్ట్రేషన్ చేసి ల్యాబ్ పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందించాలన్నా రు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో కలెక్టర్ వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య ఆరోగ్య రంగంలో విప్లవాత్మక కార్యక్రమంగా నిలుస్తుందన్నారు. ప్రతి ఇంటింటిలోని ప్రజల ఆరోగ్య స్థితి గతులను సర్వే చేసి, వారి వివరాలు నమోదు చేసుకుని వైద్య పరీక్షలు నిర్వహించి, అనారోగ్యంగా ఉన్న వారిని క్యాంప్‌నకు తీసుకువచ్చి వైద్యం అందించే కార్యక్రమాన్ని పక్కా ప్రణాళిక మేరకు చేయటం జరుగుతుందన్నారు. ప్రజానీకం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి పల్లవి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి శ్రావణబాబు, డిప్యూటీ డీఎంహెచ్‌వో అన్నపూర్ణ, ఎంపీడీవో బి.బాబురావు, తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ, సర్పంచ్ అత్తోట వినీతారాణి, ఎంపీటీసీ జయపాల్‌రెడ్డి, డీసీఎంఎస్ డైరెక్టర్ కుర్రా పాములు, పెదమస్తాన్, కాసు ఈశ్వరరెడ్డి, అప్పిరెడ్డి, జి శ్రీరెడ్డి, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


వైద్య సేవల కోసం వచ్చిన వారితో మాట్లాడుతున్న కలెక్టర్ ఎం వేణుగోపాలరెడ్డి

సమన్వయంతో సేవలందించండి

గుంటూరు వెస్ట్: జిల్లాలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కేంద్రాలకు ప్రజలు పెద్ద ఎత్తున వస్తున్నారని, చక్కని వైద్యాన్ని సైతం పొందుతున్నారని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరం నుంచి నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు ప్రజలకు మరింత మెరుగైన వైద్యం, సదుపాయాలు కల్పించేందుకు సమన్వయంతో పనిచేయాలన్నారు. క్యాంపులకు వచ్చే వారికి ఇబ్బంది లేకుండా ఓపీ, మందులు, పరీక్షలు తదితర అవసరాలకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే పాఠశాలల్లో డ్రాపవుట్స్ లేకుండా చూడాలన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారంతోపాటు రక్త పరీక్షలు నిర్వ హించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డీఆర్వో చంద్రశేఖరరావు, డిప్యూటీ కలెక్టర్ సుజాత, జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ ఏ.శ్రావణ్ బాబు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ప్రతి ఒక్కరు దేశభక్తిని కలిగి ఉండాలి


కలశాలతో జెడ్పీ సీఈవో మోహనరావు, జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు

- జెడ్పీ సీఈవో మోహనరావు
- మండల పరిషత్ కార్యాలయంలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం

గుంటూరు రూరల్: ప్రతి ఒక్కరూ దేశభక్తిని కలిగి ఉండాలని జిల్లా పరిషత్ సీఈవో జె.మోహనరావు పేర్కొన్నారు. బుధవారం నగరంలోని మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎస్.ఆదినారాయణరావు అధ్యక్షతన స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. మేరి మట్టి మేరి దేశ్ కార్యక్రమంలో భాగంగా ఆజాదీకా అమృత్ మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈవో మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు మేరీ మట్టి మేరాదేశ్ కార్యక్రమం చేపట్టటం జరిగిందన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామం నుంచి గ్రామ ప్రతినిధులతో ఆ గ్రామ మట్టిని కలశాల్లో తెచ్చి మండలంలోని అన్ని గ్రామాల మట్టిని ఒక కలశంలో నింపి మండల ప్రతినిధులతో త్వరలో ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీ నిర్వహించే కార్యక్రమంలో ఆ కలశాల్లోని మట్టితో మహత్తర నిర్మాణం చేపట్టనున్నారన్నారు. రూరల్ మండలం జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు మాట్లాడుతూ ఆనాడు ఎందరో త్యాగధనుల కృషి నేడు మనం అనుభవిస్తున్న స్వాతంత్ర్యమని తెలిపారు. నాడు గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యాన్ని నేడు మన ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయాల ద్వారా అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. ప్రతి ఒక్కరం దేశ భక్తిని కలిగి దేశాభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో భాగంగా కలశాలతో మండల పరిషత్ కార్యాలయం వద్ద ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ ఎల్ వజ్రశ్రీ, ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరావు, ఎంఈవో సుబ్రమణ్యం, ఏఈ రమేష్, సర్పంచ్‌లు డబ్బూరి సూర్యప్రకాశ రావు, ఎదురుపాక వెంకట్, లలిత కుమారి, ఏరువ జగన్ మోహన్‌రెడ్డి, సతీష్, ఆవుల సుందర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయం సిబ్బంది, మండలస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల అందజేత

గుంటూరు రూరల్: ప్రతి కుటుంబానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఒక పెద్ద కొడుకుగా, ప్రతి కుటుంబానికి ఆర్థికాభివృద్ధి కల్పించేందుకు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పేర్కొన్నారు. బుధవారం నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్య శ్రీ ద్వారా పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను అందిస్తూనే ఇబ్బందికర పరిస్థితుల్లో ఉన్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయాన్ని జగనన్న అందిస్తున్నారన్నారు. అదేవిధంగా ప్రజల సంక్షేమం కోసం ఇంటివద్దకే అనేక సంక్షేమ పథకాలను జగనన్న అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో భాగంగా నియోజక వర్గంలోని 21 మందికి రూ.34 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి ఫైనాన్స్ అసిస్టెన్స్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, కార్పొరేటర్లు, సర్పంచ్‌లు, వివిధ కార్పొరేషన్‌ల డైరెక్టర్‌లు, సొసైటీల చైర్మన్లు, డైరెక్టర్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


చెక్కులను అందుకున్న కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

16 నుంచి ఈవీఎంల ప్రథమస్థాయి పరీక్ష

- రాజకీయ పార్టీల ప్రతినిధులు తప్పనిసరిగా పాల్గొనాలి
- జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్: ఈవీఎంల ఫస్ట్ లెవెల్ చెకింగ్ ఈ నెల 16 నుంచి స్థానిక రెవెన్యూ కల్యాణ మండపంలో నిర్వహిస్తామని రాజకీయ పార్టీల ప్రతినిధులు తప్పనిసరిగా పాల్గొనాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో ప్రజాప్రతినిధులు, అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఫస్ట్ లెవెల్ చెకింగ్‌లో పాల్గొనే పార్టీల నాయకుల వివరాలు ముందుగా అందిస్తే ప్రత్యేక పాస్‌లు జారీ చేస్తామన్నారు. ఈవీఎంలకు ఇప్పటికే అంగీకార (యాక్సప్టెన్సీ) టెస్ట్ నిర్వహించామన్నారు. ప్రతి ఈవీఎంలో ఫస్ట్ చెకింగ్‌లో భాగంగా 96 ఓట్లను పోల్ చేస్తారన్నారు. ర్యాండమ్‌గా వీటిని తనిఖీ నిర్వహిస్తామన్నారు. ఇందులో ఎన్నికల సంఘం తెలిపిన మార్గదర్శకాలను ప్రతి ఒక్కరూ పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. స్పెషల్ సమ్మరీ రివిజన్–2024లో భాగంగా చేపట్టే ఏ ప్రక్రియ అయినా అత్యంత పారదర్శకంగా ఉండాలని తెలిపారు. దీన్లో భాగంగా వచ్చే అన్ని క్లెయిమ్స్ పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డీఆర్వో చంద్రశేఖరరావు, డెప్యూటీ కలెక్టర్ సుజాత, గుంటూరు ఆర్డీఓ ప్రభాకరరెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టడానికి సమష్టి కృషి అవసరం


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి, విజయ్‌కుమార్, ఫ్రాన్సిస్ తంబి, మనోరంజని, ఆదిలక్ష్మి, ప్రమీల

జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ పార్థసారథి

గుంటూరు ఎడ్యుకేషన్: బాల్య వివాహాలు లేని భారతదేశం లక్ష్యంగా సమాజం సమష్టిగా కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ పార్థసారథి తెలిపారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మహిళాభివృద్ధి–శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జెడ్పీ సమావేశ మందిరంలో బాల్య వివాహ నిషేధ చట్టం–2006తో పాటు బాల్య వివాహాల నిరోధంపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మార్గదర్శకాలపై గుంటూరు డివిజన్ పరిధిలోని మహిళా పోలీసులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి, సుప్రీంకోర్టు న్యాయవాది భువన్ రిభు రచించిన చైల్డ్ మ్యారేజెస్ ఇన్ ఇండియా అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2030 నాటికి భారతదేశాన్ని బాల్య వివాహ రహితంగా ఏ విధంగా తీర్చిదిద్దాలనే విషయాలపై పుస్తకంలో సమగ్రంగా చర్చించారని చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న బాల్య వివాహాల్లో మూడింట ఒక వంతు మన దేశంలోనే జరుగుతున్నాయని, వీటిని వచ్చే రెండేళ్లలో 10 శాతానికి తగ్గించాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లాను బాల్య వివాహ రహితంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు మాట్లాడుతూ నగర పరిధిలో ఎక్కడా బాల్య వివాహాలకు తావు లేకుండా వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో ప్రతిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేశామని చెప్పారు. పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ బాల్య వివాహాలకు వ్యతిరేకంగా క్షేత్రస్థాయిలో ప్రజల్ని చైతన్యవంతులుగా చేయడంలో వార్డు సచివాలయాల వారీగా మహిళా పోలీసు లు మరింతగా కృషి చేయాలని సూచించా రు. కార్యక్రమంలో ఏపీ బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు ఆదిలక్ష్మి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ ఆరోగ్య ప్రమీల, ఆర్డీవో ప్రభాకర్‌రెడ్డి, సీఆర్ఏఎఫ్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ ఫ్రాన్సిస్ తంబి, జిల్లా బాలల పరిరక్షణాధికారి విజయ్‌కుమార్, జిల్లా మహిళా శిశు అభివృద్ధి అధికారిణి బి. మనోరంజని, సీడీపీవోలు, మహిళా రక్షణ కార్యదర్శులు పాల్గొన్నారు.

కాలువలో పడిన కారు

రొంపిచర్ల: వేగంగా వస్తున్న కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న కాలువలో పడిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఈ ఘటనలో కారు డ్రైవర్ మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు.. నెల్లూరుకు చెందిన న్యాయవాదులు ఎస్.మురళీకృష్ణ, హైదరాబాద్ నుంచి నెల్లూరు కారులో వెళ్తున్నారు. తంగెడమల్లె మేజర్ కాలువ దాటే క్రమంలో కారు అదుపు తప్పి రోడ్డు పక్కన గల కాలువలో పడింది. ఈ ప్రమాదంలో కారు డ్రైవర్ షేక్ ఉస్మాన్(50) అక్కడికక్కడే మృతి చెందారు. కారులో ఉన్న న్యాయవాదులు మురళీకృష్ణ, సర్దార్ తీవ్రంగా గాయపడ్డారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. క్షతగాత్రులను 108లో నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు.

ఐకమత్యంతోనే సమస్యలు పరిష్కారం

ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు


గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ, ఎయిడెడ్ విద్యారంగంలో మూడున్నర దశాబ్దాలకుపైగా సేవలందించిన అధ్యాపకులు ఉద్యోగ విరమణ అనంతరం తమకు రావల్సిన పెన్షన్, ఇతర అలవెన్సుల కోసం సంఘటితంగా పోరాడాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. బుధవారం బ్రాడీపేటలోని మాజేటి గురవయ్య డిగ్రీ కళాశాల సమావేశ మందిరంలో 'యునైటెడ్ యూజీసీ పెన్షనర్స్ అసోసియేషన్' ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ అధ్యాపక ఉద్యమ నేత, మాజీ ఎమ్మెల్సీ ఎంజే మాణిక్యరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ 2004 తరువాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ విరమణ అనంతరం గౌరవంగా, హక్కుగా పొందే పెన్షన్‌ను రద్దు చేసి రకరకాల స్కీంల పేరుతో ఉద్యోగుల నడ్డి విరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ యంత్రాంగంలో కీలక భాగస్వాములైన ఉద్యోగులకు జీతభత్యాలతో పాటు అట్టడుగు ప్రజల జీవన ప్రమాణాల కోసం సంక్షేమ పథకాలను సైతం అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. జిల్లా ఖజానా శాఖ డిప్యూటీ డైరెక్టర్ బి.రాజగోపాల్ మాట్లాడుతూ విశ్రాంత యూజీసీ ఉద్యోగులు ఈకేవైసీ ఎప్పటికప్పుడు అప్డేట్ చేసుకోవడం ద్వారా ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రతినెలా పింఛను ఇతర అలవెన్సులు పొందవచ్చునని తెలియజేశారు. సభకు అధ్యక్షత వహించిన యునైటెడ్ యుజీసీ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ప్రొఫెసర్ వెన్నిసెట్టి సింగారావు మాట్లాడుతూ యూజీసీ పెన్షనర్స్ అసోసియేషన్ రాజకీయాలకు అతీతంగా తమ సమస్యలపై సంఘటితంగా తమ ఐకమత్యంతో కృషి చేస్తుందని వివరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వి.వి జయకుమార్, కార్యదర్శి డాక్టర్ మంచాల బోసు బాబు, సహాయ కార్యదర్శులు డాక్టర్ జి.సుధాకర్, ఉపాధ్యాయ మహిళా ప్రతినిధి డాక్టర్ వై. భాను భవాని, కోశాధికారి డాక్టర్ సీహెచ్ శ్రీరామమూర్తి, కార్యవర్గ సభ్యులు డాక్టర్ పి.శ్రీనివాసరావు, కేవీ కృష్ణారావు, ఎ.అజయ్ కుమార్, జి.సాంబశివరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, వేదికపై డొక్కా మాణిక్య వరప్రసాద్

గులాబి రంగు పురుగుపై అప్రమత్తంగా ఉండాలి

డాట్ సెంటర్ శాస్త్రవేత్త రమేష్

నరసరావుపేట రూరల్: పత్తిలో గులాబిరంగు పురుగుపై రైతులు అప్రమత్తంగా ఉండాలని డాట్ సెంటర్ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.రమేష్ హెచ్చరించారు. మండలంలోని పెదరెడ్డిపాలెం, కేఎం అగ్రహారం, ఇస్సప్పాలెం గ్రామాల్లో పత్తి పంటను బుధవారం పరిశీలించారు. రమేష్ మాట్లాడుతూ గులాబిరంగు పురుగు ఉధృతిని పత్తిలో గమనించినట్లు తెలిపారు. ఈనెల నుంచి పురుగు ఉధృతి ఇంకా పెరిగే అవకాశం ఉందని చెప్పారు. రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా పురుగును నివారించవచ్చని పేర్కొన్నారు. పురుగు ఉధృతిని, ఉనికిని తెలుసుకునేందుకు ఎకరానికి నాలుగు లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. దీని ద్వారా మగ రెక్కల పురుగును బంధించి ఆడ రెక్కల పురుగు గుడ్లు పెట్టే శక్తిని తగ్గించవచ్చని వివరించారు. పురుగు నివారణకు ప్రొఫినోఫాస్ 4మి.లీ. లేదా క్లోరిపైరిఫాస్ 500 మి.లీ. లేదా వేపనూనె ఒక లీటరును వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు మందులు మార్చి పిచికారి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ పవన్‌కుమార్ పాల్గొన్నారు.


పెదరెడ్డిపాలెంలో పత్తి పంటను పరిశీలిస్తున్న సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.రమేష్